సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 21 । జూన్ । 2025



ఆకట్టుకున్న బండ్ల ప్రదక్షిణ

ఇల్లంతకుంట: గాలిపల్లిలో ముత్యాల ఎల్లమ్మ ఆలయం చుట్టూ శుక్రవారం బండ్ల ప్రదక్షిణ జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



స్పెషల్ డ్రంకెన్‌డ్రైవ్

సిరిసిల్లక్రైం: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పోలీసులు స్పెషల్ డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. తాగి వాహనాలు నడపొద్దని ఎస్పీ మహేశ్ బి గీతే సూచించారు.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

1,17,858 మందికి రైతు భరోసా

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలోని 1,17,858 మంది రైతులకు రూ.119,46,81,630 రైతు భరోసా డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం తెలిపారు. రైతులకు ఖరీఫ్ సీజన్(వానాకాలం) వ్యవసాయంలో పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.6వేల చొప్పున అందించిందని వివరించారు. ఎలాంటి పరిమితులు విధించకుండా రైతుభరోసా డబ్బులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

బైపాస్‌రోడ్డు విస్తరణపై చర్చ



ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా నుంచి ఎస్సీ కాలనీ వరకు బైపాస్‌రోడ్డు విస్తరణపై శుక్రవారం చర్చించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులకు సెట్‌బ్యాక్ కావాలని గత నెల 12న నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో పంచాయతీ ఆఫీస్‌లో స్పెషల్ ఆఫీసర్ సమావేశం ఏర్పాటు చేశారు. బైపాస్‌రోడ్డును అభివృద్ధి చేసేందుకు ఉపాధిహామీ ద్వారా రూ.50లక్షలు మంజూరయ్యాయి. కొందరు తెలిపిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని గ్రామపంచాయతీ అధి కారులు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీని వాస్, కార్యదర్శి వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవో ఆకస్మిక తనిఖీ



వేములవాడ: రాజన్న అనుబంధ బద్దిపోచమ్మ, భీమేశ్వరాలయాల్లో ఈవో రాధాభాయి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కౌంటర్లు, క్యూలైన్లు పరిశీలించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఈవో అశోక్, పర్యవేక్షకుడు రాజు ఉన్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయంలో రేవతీ నక్షత్రోత్సవం సందర్భంగా అభిషేకం, పరివార దేవతార్చనలు, సదస్యం నిర్వహించారు.

వేములవాడలో అడ్వకేట్ల నిరసన



వేములవాడ: హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ క్యాషియర్ పి.నారాయణపై దాడిని ఖండిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్వకేట్లు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్దన్, అడ్వకేట్లు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, పొత్తూరి అనిల్‌కుమార్, గుడిసె సదానందం, కిషోర్‌రావు, పురుషోత్తం, పెంట రాజు, వేముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్వీప్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించే కొత్త వ్యాపారాలతో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని సెర్ప్ డీపీఎం వీరయ్య, జిల్లా ఇన్‌చార్జి డీపీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల సంఘాల్లోని 25 మంది మహిళలను సీఆర్పీలుగా చేయడానికి మౌఖిక, లిఖిత పరీక్ష నిర్వహించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు నర్సయ్య, సుదర్శన్, మల్లేశం, సీసీలు పాల్గొన్నారు.

చిన్నబోనాల శివారులో చిరుత సంచారం

సిరిసిల్లఅర్బన్: చిన్నబోనాల శివారులో చిరుత సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. శివారులోని పంట పొలంలో చిరుత అడుగులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. రైతులు, గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

యోగానందం

- నిత్య సాధనతో ఆరోగ్యం
- యోగాసనాలు వేస్తున్న జనం
- ఆరోగ్యస్పృహతో జీవనం
- నేడు యోగా దినోత్సవం

యోగా.. ప్రపంచం పాటిస్తున్న ఆరోగ్యసూత్రం. శరీరం.. మనసును ఒకతాటికిపై తెచ్చి ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే ప్రక్రియ. ప్రస్తుత ఉరుకులు.. పరుగుల జీవితంలో యోగా సాధన ఆరోగ్యమంత్రంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరోనా తర్వాత ప్రజలు పూర్తిగా ఆరోగ్యస్పృహతో జీవిస్తున్నారు. నిత్యం ఆసనాలు వేస్తూ మానసికంగా.. శారీరకంగా ఆరోగ్యంగా జీవిస్తున్నారు. దీని ప్రాధాన్యతను గుర్తించిన ఐక్యరాజ్యసమితి పదేళ్ల క్రితమే జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించింది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

యోగాతో నయమైంది



కరీంనగర్‌స్పోర్ట్స్: 2013 నుంచి 2016 వరకు అనారోగ్యంతో బాధపడ్డాను. యోగా చేయాలని పలువురు చెప్పడంతో ప్రతీ రోజు సాధన చేస్తున్నాను. ప్రస్తుతం ఎలాంటి రోగాలు లేకుండా చాలా సంతోషంగా గడుపుతున్నాను.

– కె.వందన

ఆస్తమా, బీపీ పోయాయి



కరీంనగర్‌స్పోర్ట్స్: సర్వరోగ నివారణి యోగా అనే దానికి నేనే నిదర్శనం. యోగాసనాలు చేయకముందు బీపీ, ఆస్తమాతో బాధపడ్డాను. ఇక్కడ డేకేర్ సెంటర్‌కు వచ్చినప్పటి నుంచి అన్ని నయమయ్యాయి. ఇప్పుడు చాలా చురుకుగా ఉండగలుగుతున్నాను.

– కె.అరుణ



- వివరాలు 8లో ▶

పెద్దపల్లిలో యోగాసనాలు వేస్తున్న అశ్విని

రెవె'న్యూ' బాగోతం !

- ఇందిరమ్మ ఇసుక పక్కదారి
- అధికారుల కినుక.. ఆందోళనలో లబ్ధిదారులు
- వెల్లువెత్తిన విమర్శలు



సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో ప్రైవేటు నిర్మాణం వద్దకు చేరిన ఇందిరమ్మ ఇండ్ల ఇసుక

సిరిసిల్లటౌన్: అక్రమ ఇసుక రవాణా కఠినతరం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను సిరిసిల్ల రెవెన్యూ అధికారులు బేఖాతర్ చేస్తున్నారనటానికి ఇదో నిదర్శనం. కేవలం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికే కేటాయించాల్సిన ఇసుకను ప్రైవేటు నిర్మాణాలకు కేటాయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రైవేటు వ్యక్తులకు ఇసుకను అందించడం సిరిసిల్లలో శుక్రవారం దుమారం రేపింది. ఇందిరమ్మ లబ్ధిదారులకు అడ్డగోలు నిబంధనలు పెట్టే అధికారులు తమకు అనుకూలమైన వారికి ఇసుకను అందజేయడంపై స్థానికులు విమర్శలు గుప్పించారు.

అసలేం జరిగింది?

పట్టణంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక రీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు పర్మిషన్ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు సుమారు 30 మందికి శుక్రవారం ఇసుక తీసుకునేందుకు రెవెన్యూ అధికారులకు సిఫారసు లేఖలు అందించినట్లు సమాచారం. లబ్ధిదారులతోపాటు రెవెన్యూ అధికారులు నిబంధలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తుల పేర్లనూ జాబితాలో చేర్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈవిషయమై శుక్రవారం పలువురు రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగడం వైరల్ అయ్యింది.

కలెక్టర్ పేరుతో అధికారుల బుకాయింపు !

మున్సిపల్ నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకే శుక్రవారం రెవెన్యూ అధికారులు ఇసుకకు అనుమతించాల్సి ఉండగా ప్రైవేటు వ్యక్తులకు ఎలా అందించారని స్థానికులు వాపోయారు. ఈవిషయమై రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే కలెక్టర్ ఆదేశాలున్నాయని బుకాయిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి కేవలం రెండు, మూడు ట్రిప్పుల ఇసుక మాత్రమే అవసరం ఉంటుందని ఇందుకు ఒక్కో ట్రిప్పుకు ట్రాక్టర్ యజమానులు రూ.2వేలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై అధిక సంఖ్యలో ఇసుక ట్రిప్పులను కేటాయించినట్లు ఆరోపించారు. అధికారుల అండతో ఇసుకను కొందరు ఒక్కో ట్రిప్పునకు రూ.3,500 వరకు వసూలు చేసినట్లు సమాచారం. అధిక సంఖ్యలో ఇసుక ట్రిప్పులను సిరిసిల్ల బైపాస్‌రోడ్డుకు తరలించారని ఆ ప్రాంతంలో ప్రైవేటు నిర్మాణాలే తప్ప ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు లేవని పేర్కొన్నారు.

మా సిబ్బందిని మందలించాం

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుక్రవారం ఇసుక పర్మిట్లు ఇచ్చే క్రమంలో మా సిబ్బంది ఓవర్‌లుక్‌లో వెళ్లారు. ఈవిషయమై వారిని మందలించాం. ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక ట్రిప్పుల కేటాయింపుపై విచారణ చేపడుతున్నాం. ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్‌కుమార్, సిరిసిల్ల తహసీల్దార్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీసర్కిల్ ద్వారా నిర్వహించే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీడీవో బి.రాజమనోహర్‌రావు తెలిపారు. రూ.3లక్షలలోపు వార్షికాదాయం ఉండి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థులు ఈ బ్యాచ్‌ల ప్రవేశానికి జూలై 7లోపు http://tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040–23546552 లేదా 8121626423లో సంప్రదించాలని సూచించారు.

రికార్డు సరిచేయాలని విన్నపం

వీర్నపల్లి(సిరిసిల్ల): కాళేశ్వరం పైపులైన్ కోసం తమ భూమిని తీసుకుంటే.. ఆ సర్వే నంబర్ మొత్తానికి రైతుభరోసా రాలేదని.. రికార్డులు సరిచేయాలని కోరుతూ సిరిసిల్ల ఆర్డీవోకు రైతులు వినతిపత్రం అందించారు. వీర్నపల్లి, బంజెర్ల, మద్దిమల్ల, కంచర్ల రైతులు మాట్లాడుతూ కాళేశ్వరం 9వ ప్యాకేజీ కింద గుంట నుంచి 10 గుంటల వరకు సేకరించి.. అంతమేరకే నష్టపరిహారం చెల్లించారన్నారు. ఇటీవల రైతుభరోసా డబ్బులు రాకపోవడంతో అధికారులను అడిగితే భూసేకరణలో సంబంధిత సర్వే నంబర్లు ఉండడంతోనే రాలేదని తెలిపారన్నారు. ఇప్పటికైనా అధికారులు రికార్డులు సర్వే చేయాలని కోరారు.

వర్షాలు కురవాలని..



ఎల్లారెడ్డిపేటలో కప్పతల్లి ఆడుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రైతులు శుక్రవారం శివాలయంలో శివలింగంను జలదిగ్బంధం చేశారు. అనంతరం కర్రకు కప్పను కట్టి కప్పతల్లి ఆట ఆడారు. ఇంటింటికీ తిరుగగా మహిళలు కప్పతల్లిపై నీళ్ల పోసి వర్షాలు కురువాలని వేడుకున్నారు. రెడ్డి సంక్షేమ సంఘాల అధ్యక్షులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, రాగుల ఎల్లారెడ్డి, పారిపల్లి సంజీవరెడ్డి, బందారపు మల్లారెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, ముత్యంరెడ్డి, నంది కిషన్, బాపురెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాసనాలతో సుఖప్రసవాలు




జ్యోతి వెలిగిస్తున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, యోగా సాధన చేస్తున్న అంగన్‌వాడీలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.రజిత

సిరిసిల్ల: యోగాసనాలతో గర్భిణులు సుఖప్రసవాలకు అవకాశం ఉందని, సులభంగా వీలైనమేరకు ఆసనాలు సాధన చేసి సీ–సెక్షన్(ఆపరేషన్) లేకుండా నార్మల్‌గా డెలివరీ అయ్యే అవకాశం ఉంటుందని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలతో గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ దేశంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీ–సెక్షన్లలో ముందుందని, నార్మల్ డెలివరీల కోసం యోగాసనాలను నేర్చుకోవాలన్నారు. నిత్య సాధనతో ఆరోగ్యం బాగుంటుందన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యం, మానసిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఆర్యజనని అనే ప్రత్యేక కార్యక్రమంలో యోగా శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. మహిళలు గర్భవతులుగా ఉన్నప్పుడు, బాలింతలు అయినప్పుడు చేయాల్సిన ప్రత్యేక ఆసనాలపై అవగాహన ఉండాలన్నారు. యోగాతో పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండడంతో పాటు సాధారణ ప్రసవాలు జరుగుతాయని లక్ష్మీరాజం వివరించారు. రామకృష్ణ మఠం డాక్టర్లు అంజలి, దీప్తి, పిల్లల డాక్టర్ సురేంద్రబాబు, సీడీపీవోలు సౌందర్య, ఉమారాణి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రోజా, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బాలకిషన్, ఇన్‌చార్జి ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ పరమేశ్వర్, సఖీ కో–ఆర్డినేటర్ మమత పాల్గొన్నారు.

పద్మశాలీ భవనం నిర్మిస్తాం

- హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో పద్మశాలీ భవనం నిర్మిస్తామని, మార్కండేయస్వామి ఆలయ పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో కలిసి సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం నేతన్నలను ఆదుకోడానికి సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, జౌళిశాఖ జేడీ ఎస్.వెంకటేశ్వర్‌రావు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పూజలు

వేములవాడ: సల్లంగచూడు పెద్దమ్మతల్లీ అంటూ పట్టణంలోని మహాలక్ష్మీవీధిలోని ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పూజలు చేశారు. మున్సిపల్ తరఫున పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. తూర్పు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాలు తీశారు.

యోగాక్షరం

సిరిసిల్లఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సిరిసిల్లలోని గీతానగర్ హైస్కూల్ విద్యార్థులు యోగా అక్షరరూపం ప్రదర్శించారు. ఇంగ్లిష్ అక్షరాలలో విద్యార్థులు మైదానంలో కూర్చుని యోగాసనాలు వేశారు.



సాధికారతే లక్ష్యంగా..



శిక్షణలో పాల్గొన్న గ్రామైక్య సంఘాల కొత్త పాలకవర్గ సభ్యులు

- మహిళా సంఘాలకు కొత్త సారథులు
- ముగిసిన శిక్షణ తరగతులు
- జిల్లాలో 441 గ్రామైక్య సంఘాలు

గంభీరావుపేట(సిరిసిల్ల): మహిళా సాధికారతే లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు. జిల్లాలోని ఐకేపీ మహిళా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు ఆర్థిక కార్యకలాపాలు, నాయకత్వ లక్షణాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, ప్రభుత్వ పథకాల అమలుపై శిక్షణ ఇచ్చారు. ఒక్కో సంఘంలో 10 నుంచి 20 మంది సభ్యులు ఉంటారు. మొదట గ్రామైక్య అధ్యక్షురాలిని, తర్వాత మండల సమాఖ్య అధ్యక్షులను ఎన్నుకున్నారు. వారి ద్వారా జిల్లా సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకున్నారు. వీరికి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సీనియర్ రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణనిస్తున్నారు.

జిల్లాలో 441 గ్రామైక్య సంఘాలు

జిల్లాలో 441 గ్రామైక్య సంఘాలు, 10,014 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 1,15,317 మంది సభ్యులు ఉన్నారు. నూతనంగా గ్రామైక్య సంఘాలకు ఎన్నికైన పాలకవర్గాలకు సంఘాల నిర్వహణ, ఆర్థిక కార్యకలాపాలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులపై చైతన్యం పొందడమే కాకుండా సామాజిక రంగాల్లో చురుకుగా పాల్గొనేలా శిక్షణ ఇచ్చారు. శిక్షకులు, సామూహిక చర్చలు, ప్రాక్టికల్ సెషన్లు, విజువల్ ప్రజెంటేషన్ల ద్వారా శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహిళా సంఘాల మధ్య సరైన సంబంధం ఏర్పడేందుకు ఈ శిక్షణ బలమైన పునాది కానుంది.

భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవచ్చు



నూతనంగా ఎన్నికైన వారికి శిక్షణ తరగతుల్లో అనేక విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. గంభీరావుపేటలోని 44 గ్రామైక్య సంఘాల పాలకవర్గ సభ్యులకు మూడు దశల్లో శిక్షణ ఇస్తున్నాం. మహిళల్లో ఉత్సాహం నింపుతూ.. నమ్మకాన్ని కలిగిస్తూ సామాజిక, ఆర్థికపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– కాకతీయ, సీనియర్ రిసోర్స్ పర్సన్

సంఘాల నిర్వహణపై అవగాహన



నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు సంఘాల నిర్వహణ, నిర్ణయాలు, ఆర్థికపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు సమర్థ నాయకత్వాన్ని వినియోగించుకుంటే గ్రామీణ అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుంది.

– సుదర్శన్, ఐకేపీ ఏపీఎం, గంభీరావుపేట

బాధితులకు భరోసాగా ఉండాలి

- ఎస్పీ మహేశ్ బి గీతే



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల ఎడ్యుకేషన్: మహిళలు, చిన్నారులకు అండగా భరోసా కేంద్రాలు ఉండాలని ఎస్పీ మహేశ్ బి గీతే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని ఎస్పీ సందర్శించారు. బాధితులకు తక్షణ సూచనలు, సలహాలు, సహాయం అందించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. భరోసా సెంటర్ కల్పిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లైంగికదాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్, పరిహారం ఇప్పించే వరకూ అండగా నిలవాలన్నారు. లైంగిక, భౌతికదాడులకు గురైన బాధితులకు భరోసా సెంటర్లో కల్పించే న్యాయసలహాలు, సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్యపరంగా తీసుకుంటున్న చర్యలు, మహిళల వేధింపులపై నమోదవుతున్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. డీసీఆర్బీ సీఐ నాగేశ్వరరావు ఉన్నారు.

క్రీడలకు పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్లలో ఆర్చరీ అకాడమీ ప్రారంభం



ఆర్చరీ అకాడమీ ప్రారంభిస్తున్న విప్ శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్/చందుర్తి: ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన ఆర్చరీ అకాడమీని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. రాష్ట్రంలోనే ఆర్చరీ అకాడమీ సిరిసిల్లలో ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. పదేళ్లలో క్రీడలకు రూ.400 కోట్లు కేటాయిస్తే తమ ప్రభుత్వంలో 11 నెలల్లోనే రూ.800 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వేములవాడ రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తిప్పాపూర్‌లోని మినీస్టేడియం పరిశీలించి మాట్లాడారు. వేములవాడలో ఇండోర్ స్టేడియం, చందుర్తి మండలం మూడపల్లి వద్ద మినీస్టేడియం నిర్మాణాలకు స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, సూర దేవరాజు, చక్రధర్‌రెడ్డి, క్రీడలశాఖ అధికారి రాందాస్, శ్రీకుమార్, యెల్లె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

కరీంనగర్‌రూరల్: ద్విచక్రవాహనం గుంతలోపడగా తీవ్రంగా గాయపడి వివాహిత మృతిచెందిన సంఘటన కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చొప్పదండి మండలం వెదురుగట్టకు చెందిన బొంగోని నర్సయ్య చిన్న కూతురు అఖిల (26) భర్త శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై శుక్రవారం అత్తగారిల్లు అయిన చిన్న ముల్కనూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో చెర్లభూత్కూర్ శివారులో రోడ్డుపై ఉన్న గుంతలో బైక్ పడిపోవడంతో అఖిల తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

మహిళకు కత్తిపోట్లు.. పరిస్థితి విషమం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన బోగ కమల అనే మహిళపై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి కత్తితో దాడిచేశాడు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న కమలపై ఓ వ్యక్తి వచ్చి కత్తితో దాడిచేశాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి పారిపోయాడు. స్థానికులు వెంటనే కమలను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై సదాకర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా, హరీశ్ అనే వ్యక్తి దాడిచేసినట్లు ఆమె పేర్కొన్నట్లు అనుమానిస్తున్నారు. మహిళకు మెడపై గాయాలు కాగా.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

- మరో ఇద్దరికి సైతం..

ముస్తాబాద్(సిరిసిల్ల): నేరం చేసిన వారు ఎంతటి వారైన చట్టం ముందు తప్పించుకోలేరని ఎస్పీ మహేశ్ బీ గీతే పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన వ్యక్తిని భార్య హత్య చేసిన ఘటనలో భార్యతోపాటు మరో ఇద్దరికి జీవిత ఖైదు విధించారు. ముస్తాబాద్ ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన ధరంసోత్ శంకర్‌నాయక్ (55)ను 28.11.2020 నాడు భార్య సరోజ మరో ఇద్దరి సహకారంతో రోకలిబండతో కొట్టి చంపింది. సరోజకు సంతానం కలుగకపోవడంతో రాజవ్వ అనే మహిళను శంకర్‌నాయక్ పెళ్లి చేసుకున్నాడు. వారికి ముగ్గురు పిల్లలు. అప్పటి నుంచి శంకర్‌నాయక్‌తో మొదటి భార్య సరోజ గొడవపడుతోంది. ఆస్తి మొత్తం రెండో భార్య పిల్లల పేరిట భర్త రాసిస్తాడనే అనుమానంతోనే సరోజ, ఆమె సోదరుడు బానోతు శ్రీనివాస్, సోదరి తేజావత్ లక్ష్మి కలిసి రోకలిబండతో కొట్టి చంపారు. ఈ కేసులో రెండో భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి నీరజ.. నిందితులు ధరంసోత్ సరోజ, బానోతు శ్రీనివాస్, తేజావత్ లక్ష్మిలకు జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నేరం రుజువు చేయడంలో కీలకంగా పనిచేసిన సీఐలు సర్వర్, ఉపేందర్, మొగిలి, ఎస్సై గణేశ్, పీపీ శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు.



పెద్దపల్లిలో యోగాసనాలు వేస్తున్న స్వాతి

యోగానందం

- నిత్య సాధనతో ఆరోగ్యం
- ఆరోగ్యంగా జీవిస్తున్న జనం
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన అవగాహన
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం



సిరిసిల్లటౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమంటూ జిల్లా ప్రజలు యోగా సాధన చేస్తున్నారు. శారీరకంగా ధృడంగా ఉంటే ఏదైనా సాధించవచ్చనే ఉద్దేశంతో ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. ఈక్రమంలోనే వయసుతో సంబంధం లేకుండా నిత్యం యోగా సాధన చేస్తూ చలాకీగా జీవిస్తున్నారు. విధుల్లో ఒత్తిడి..మానసిక..శారీరక శ్రమను తట్టుకునేందుకు అందరిబాట యోగానే మారింది. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యోగా సాధనతో కలిగే ప్రయోజనాలు, సాధకుల అభిప్రాయాలు...

ఉద్యానవనమే మందిరం



పార్క్‌లో సాధన చేస్తున్న కాలనీ వాసులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని చిల్డ్రన్స్‌పార్క్‌ను యోగా మందిరంగా మార్చుకొని కాలనీవాసులు సాధన చేస్తున్నారు. దాదాపు ఆరేళ్లుగా యోగా గురువు ఆరెల్లి సమ్మయ్య ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పార్క్‌లో యోగా సాధన చేస్తున్నారు. 2024లో సింగరేణి కార్మికుడిగా రిటైర్మెంట్ తీసుకున్న సమ్మయ్య ప్రస్తుతం యోగా శిక్షణపైనే సమయం కేటాయిస్తున్నారు.

టీచర్ నుంచి రాష్ట్ర జట్టు కోచ్ వరకు..



శంకరపట్నం.. వెంకటేశ్వర్లపల్లి పాఠశాలలో యోగా నేర్పుతున్న కోటేశ్వర్‌రావు

శంకరపట్నం: వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్కాకుల కోటేశ్వర్‌రావు 15 ఏళ్లుగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. బాబా రాందేవ్ వద్ద హరిద్వార్‌లో శిక్షణ పొందారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, ధ్యానంతో మనసు ఉత్తేజపరుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా శిక్షణ ఇవ్వడంతో తిరువనంతపురం, హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన పోటీల్లో పతకాలు సాధించారు.

శ్రీనివాస్.. జీవనయోగం



సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉప్పల శ్రీనివాస్ జీవన ప్రయాణమే యోగాగా మారింది. ఆదియోగి నిత్య యోగ సాధనాలయం పేరిట శిక్షణసంస్థను నెలకొల్పి ఇప్పటికే వందలాది శిబిరాలను ఏర్పాటు చేశారు. చాలా మంది యోగా సాధకులను తయారు చేశారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని భావించి మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

సీనియర్స్.. యోగాసనం



కరీంనగర్‌స్పోర్ట్స్: యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సీనియర్ సిటిజెన్స్ చెబుతున్నారు. బిజీ లైఫ్‌లో యోగాతోనే ఆరోగ్యంగా ఉంటామంటున్నారు. సీనియర్ సిటిజెన్స్ మాత్రం యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలంటున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ డే కేర్ సెంటర్ ప్రారంభమైనప్పటి నుంచి నిత్యం సాయంత్రం యోగా సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయి



జమ్మికుంట: రిటైర్‌మెంట్ తర్వాత సమాజ సేవ చేయాలనే ఆలోచనతో సదాశయ స్వచ్ఛంద సేవ సంస్థతో అవయవ దానం స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నాను. స్వచ్ఛందంగా యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాను. యోగాతో దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయి.

– మచ్చగిరి నరహరి, యోగా గురుజీ ,జమ్మికుంట

11 సంవత్సరాలుగా...



కరీంనగర్‌లో పదకొండేళ్లుగా యోగాలో శిక్షణ ఇస్తున్నాను. గతంలో భగత్‌నగర్‌లోని మా ఇంటి దాబాపై యోగా సాధకులకు శిక్షణ ఇచ్చాను. ప్రస్తుతం డే కేర్ సెంటర్‌లో తరగతులు నిర్వహిస్తున్నాను. సుమారు 30 మందికిపైగా సీనియర్ సిటిజెన్స్, రిటైర్డ్ ఉద్యోగులు వస్తున్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

– మర్రి రాజేందర్, యోగా నిపుణులు

కేజీ టు పీజీలో నిత్యం



యోగా చేస్తున్న గంభీరావుపేట విద్యార్థులు, యువకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల ప్రాంగణం యోగా సాధన కేంద్రంగా మారింది. అయూష్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యం యోగా సాధన చేస్తున్నారు. యోగా శిక్షకుడు పెరుమెల్లి దేవయ్య ఆధ్వర్యంలో నిత్యం సాయంత్రం విద్యార్థులు, స్థానికులు యోగా సాధన చేస్తున్నారు.

శ్రమకు దక్కిన గుర్తింపు



యోగాసనాలు చేస్తున్న మహిళలు

ధర్మారం: మండల కేంద్రంలో 2016లో పతంగలి యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జంగిలి సుధార్–మంజుల దంపతులు ఉచిత యోగా సాధన తరగతులు ప్రారంభించారు. మొదట్లో స్పందన అంతంతే ఉండగా.. 2019లో కరోనా తర్వాత అందిరలోనూ యోగాపై శ్రద్ధ కలిగి.. యోగా తరగతులకు హాజరయ్యే వారి సంఖ్య పెరిగింది. ఈ దంపతుల కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2024 నవంబర్ 19న ఆయుష్షు నుంచి శిక్షకులుగా నియమించింది. నిత్యం ఉదయం 4 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ



లావణ్య

పదేళ్లుగా ఆశవర్కర్‌గా పనిచేస్తున్న ముదారి లావణ్య పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ నివాసి. ముగ్గురు పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారు. గతేడాది యోగాచార్యుడు ఉప్పల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకొని జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపింది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. కేరళలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొని ప్రశంసలు అందుకుంది.

ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన



యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థి జాపతి ఆమని పటేల్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయకాలనీకి చెందిన జాపతి ఆమని హైదరాబాద్‌లో విద్యను భ్యసిస్తుంది. సహచర విద్యార్థులతో పాటు కాలనీలో పలు వురికి యోగా నేర్పి స్తుంది. పిరమిడ్ ధ్యా నం చేస్తుంది. పలు రకాల యోగాసనాలు వేస్తూ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో ప్ర తిభ చూపింది. ఒలింపిక్స్‌లో పాల్గొనడమే తన లక్ష్యమని పేర్కొంది.

15 ఏళ్లుగా నేర్పిస్తున్నా



కృష్ణహరి యోగాసనం

బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన శ్రీపతి కృష్ణహరి గత 15 ఏళ్లుగా యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. బూర్గుపల్లికి చెందిన మాజీ ఎంఈవో వెంకటస్వామి గురుజీ వద్ద యోగా నేర్చుకున్నాడు. అనంతరం బోయినపల్లి శాంతానంద యోగాశ్రమం, ప్రస్తుతం స్థానిక యునానీ ఆస్పత్రిలో యోగా శిక్షకుడిగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాణాయామంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని కృష్ణహరి తెలిపారు.

ఇంటి పేరుగా..



ఆసనం వేస్తున్న శ్రీనివాస్

ఇల్లంతకుంట(మానకొండూర్): రహీంఖాన్‌పేటకు చెందిన ఏనుగుల శ్రీనివాస్ యోగా శ్రీనివాస్‌గా గుర్తింపు పొందారు. 2002లో వల్లంపట్లలో బౌద్ధగురువు కట్ట కళాధర్‌రెడ్డి ఆనంద విహార్ యోగా ఆశ్రమంలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. రహీంఖాన్‌పేట మోడల్‌స్కూల్ విద్యార్థులకు రెండేళ్లుగా యోగా నేర్పిస్తున్నారు. యోగా సాధనతో శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు.

కరోనా తర్వాత నిత్యం



కరోనా తర్వాత నిత్యం యోగా సాధన చేస్తున్నాను. ఇందిరాపార్కులో గురువుల సమక్షంలో ప్రాణాయామం, నడవడం వంటి క్రియలు చేస్తున్నాను. యోగా సాధనతో ఆరుపదుల వయస్సులో ఆరోగ్యం పొందుతున్నాను. ప్రాచీన విద్య యోగాను అనుసరించాలి.

– గాజుల నారాయణ, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్

ఆరోగ్య సిరిసిల్ల కాంక్షిస్తూ..



ఆరోగ్య సిరిసిల్ల కాంక్షిస్తూ యోగా శిక్షణ ఇస్తున్నాను. ఇందిరాపార్కులో సహచర యోగాచార్యులు ఎలిగేటి కృష్ణ, ఉప్పల శ్రీనివాస్‌తో కలిసి నిత్యం 40 మందికి యోగాభ్యాసం కల్పిస్తున్నాం. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే యోగా శిక్షకుడిగా పలువురికి యోగాసనాలు నేర్పిస్తున్నాను.

– బిళ్ల శ్రీకాంత్, యోగా శిక్షకుడు, సిరిసిల్ల

బాబా రాందేవ్ స్ఫూర్తితో..



బాబా రాందేవ్ స్ఫూర్తితో యోగా సాధన చేస్తున్నాను. భావితరాలకు ఆరోగ్యాన్ని పంచాలన్న లక్ష్యంతోనే దాదాపు వేయి పాఠశాలల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాను. ఈ వయస్సులోనూ అథ్లెట్స్‌లో రాణిస్తున్నానంటే యోగా సాధనతోనే సాధ్యమైంది.

– రామానుజమ్మ, వెటరన్

కొంత సమయం గడపాలి



ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి యోగా సాధన చేయాలి. ఎంతటి బిజీ లైఫ్‌లోనూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే జీవితాంతం చాలా ఆరోగ్యంగా ఉండగలుగుతాం. కొన్నేళ్లుగా నేను యోగా సాధన చేస్తున్నాను.

– బి.సత్తయ్య

జీవితంలో భాగం కావాలి



నేను 2009లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ అయ్యాను. యోగాలో ఒక ప్లేయర్‌గా, సాధనకునిగా, యోగా పోషకులుగా ఎన్నో కార్యాక్రమాల్లో పాల్గొన్నాను. చాలా మందికి యోగా గురించి అవగాహన కూడా కల్పించాను. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగస్వామ్యం చేసుకోవాలి.

– జి.నరసింహస్వామి

అక్రమాలకు ముకుతాడు

- రుణ వాయిదాల స్వీకరణకు ఇక ఈపాస్

కరీంనగర్ అర్బన్: స్వశక్తి సంఘాల నిధుల స్వాహాకు చెక్ పడినట్లే. అక్రమాలకు ఆస్కారం లేకండా సాంకేతికతను వినియోగిస్తోంది. మొత్తంగా మహిళా సంఘాల సభ్యులు డిజిటల్ లావాదేవీల వైపు అడుగులు వేస్తున్నారు. నగదు రహిత చెల్లింపులతో ఆదర్శంగా నిలవడానికి ముందుకొస్తున్నారు. జిల్లాలో స్త్రీనిధి రుణాల వాయిదాల చెల్లింపులను ఈ పోస్ యంత్రాలతోనే స్వీకరిస్తున్నారు. రుణ చెల్లింపుల్లో పారదర్శకత కోసం ఈ పోస్ యంత్రాలను వాడుకలోకి తీసుకువచ్చారు. మొదటి విడతగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ఏగ్రేడ్ సంఘాల వీవోఏలకు వీటిని అందించారు. ఈ విధానంలో ఈ పోస్ యంత్రం క్యూఆర్ స్కానర్ సభ్యులు యూపీఐ చెల్లింపులు చేయవచ్చు. సమయం వృథా కాకుండా సభ్యుల ఎదుటే యంత్రం ద్వారా చెల్లింపులు పారదర్శకంగా జరుగుతాయి. సేవలపై జీరో రుసుం కూడా అదనపు ప్రయోజనం. రెండో విడతలోనూ మరిన్ని సంఘాలకు యంత్రాలు ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోంది.

అప్పటికప్పుడే రసీదు

స్త్రీనిధి రుణాల వాయిదాలు, చెల్లింపుల్లో కొన్ని సందర్భాల్లో గందరగోళం నెలకొన్న ఘటనలు కూడా ఉన్నాయి. రుణం తీసుకున్న సభ్యురాలు గ్రామ సంఘాల రుణ వాయిదా మొత్తం వీఓఏకు చెల్లిస్తారు. అధ్యక్షురాలి సంతకంతో సభ్యురాలికి రసీదు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ తరహాలో చెల్లింపులు కొన్నిచోట్ల కాకపోగా అవకతవకలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఫలితంగా సంఘాల నిర్వహణ గందరగోళంగా మారిన ఘటనలున్నాయి. చివరకు ఉన్నతాధికారుల జోక్యంతో సమస్య పరిష్కరించారు. ఈ పోస్ యంత్రం నిర్వహణతో రుణవాయిదా చెల్లింపులు కాగానే వెంటనే రసీదు చేతికి వస్తుంది. ఎవరెవరు ఎంత మొత్తం రుణ వాయిదా చెల్లించాలో యంత్రంలో పొందుపరిచి క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తున్నారు. రుణ చెల్లింపులను చూసుకోవడానికి సైతం వీలుండటం గమనార్హం. జిల్లాలో ఎంపిక చేసిన సంఘాలకు రుణ వాయిదాల చెల్లింపుల కోసం ఈ పోస్ యంత్రాలు అందించామని, వాడకంపై వీఓఏలకు అవగాహన కల్పిస్తున్నామని డీఆర్డీవో వర్గాలు తెలిపాయి.

కరీంనగర్ జిల్లాలో..

గ్రామ పంచాయతీలు	318
మొత్తం మండలాలు	16
గ్రామైక్య సంఘాలు	527
మొత్తం స్వశక్తి సంఘాలు	12,468
సభ్యులు	1,36,536

రీఫండ్ పెండింగ్ రూ.30కోట్లు !

- ప్లాట్ల రిజిస్ట్రేషన్ రద్దు చేసుకున్నా రీఫండ్ కాని డబ్బులు
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3వేల వరకు బాధితులు
- ఐదేళ్లుగా పెండింగ్‌లోనే



కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కరీంనగర్‌క్రైం: ప్లాట్లు, భూములు, ఆస్తులు ఇతరత్రా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు చలాన్ ద్వారా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి వివిధ కారణాలతో రద్దయిన వారికి రీఫండ్ కావడం లేదు. గత ఐదేళ్లుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 3వేల మంది రూ.30 కోట్ల డబ్బును స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించగా పలు కారణాలతో రద్దయి తిరిగి చలాన్ ఫీజు రీఫండ్ కావాలని సుమారు ఐదేళ్లనుంచి ఎదురుచూస్తున్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు రావడంతో కాస్త ఊపిరిపీల్చుకున్నా నేటికీ రాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

ఐదేళ్ల నుంచి ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కలుపుకొని సుమారుగా 3వేల మంది బాధితులకు రూ.30 కోట్ల వరకు రీఫండ్ మొత్తం రావాల్సి ఉంది. రూ.10 నుండి 30 వేల వరకు చిన్న మొత్తాలు ఉన్నవారు రీఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంటే కొంతమందికి వస్తున్నట్లు సమాచారం. కానీ అంతకంటే ఎక్కువగా ఉన్న వారు సుమారుగా ఐదేళ్లనుంచి వేచి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగినా తమ చేతిలో ఏమి లేదంటూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చేతులెత్తేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. తాము చెల్లించిన రిజిస్ట్రేషన్ చలాన్ డబ్బులు వస్తాయా.. రావా అని ఆవేదన చెందుతున్నారు.

ట్రెజరీ శాఖలో రిజెక్ట్

రిజిస్ట్రేషన్ శాఖలో చలాన్ డబ్బులు మొత్తం ప్రభుత్వ అకౌంట్‌లో జమచేస్తారు. రీఫండ్ రావాలంటే ఫైనాన్స్, ట్రెజరీ శాఖ నుంచి విడుదల కావాల్సి ఉంటుంది. ఆయా ఫైల్స్‌కు చెందిన ఏడాది కాలం పెండింగ్‌లో పెట్టిన ట్రెజరీ శాఖ అధికారులు బాధితులకు రీఫండ్ చేసేందుకు తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్న నెపంతో రీఫండ్ ఫైల్స్ అని రిజెక్ట్ చేయడం బాధితులకు కలవరపాటుకు గురిచేస్తోంది. పెద్ద మొత్తాల్లో ఉన్నవారు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్, పెద్దస్థాయిలో పైరవీలు చేసిన వారికి మాత్రమే వస్తున్నాయని చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ నుంచి తాము చలాన్ రూపంలో చెల్లించిన డబ్బు రీఫండ్ అయ్యేలా చూడాలని కోరుతున్నారు.



లారీ.. బారులుతీరి..

ఒకటి కాదు రెండు కాదు.. ఒకదాని వెంట మరొకటి.. వందల కొద్దీ లారీలు రైలు బోగీలను తలపిస్తూ రహదారిపై బారులు తీరాయి. లోడింగ్ ఇసుక కోసం కిలోమీటర్ల మేర నిలిచిన లారీలను చూస్తూ వచ్చిపోయే ప్రయాణికులు రైలు దబ్బాలను తలపిస్తున్నాయంటూ చమత్కరించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమన్ పల్లి వద్ద ఇసుక క్వారీ కొనసాగుతోంది. ఆన్‌లైన్‌లో డీడీలు కట్టి ఇసుక లోడింగ్ కోసం వచ్చిన లారీలు ఇలా రహదారిపై క్యూలో నిలపడం 'సాక్షి' కెమెరాకు కనిపించింది. కాగా, పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక లారీలతో తిప్పలు పడుతున్నామని రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగిన సందర్భాలు లేకపోలేదని వాపోతున్నారు రహదారి వెంట ఉన్న గ్రామాలవాసులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

31మంది విద్యార్థులు.. 10 మంది టీచర్లు




గద్దపాక ప్రైమరీ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కోసం క్యూలో విద్యార్థులు

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో ఒకే చోట ప్రాథమిక, హైస్కూల్ భవనాలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో 23మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. హైస్కూల్‌లో 8 మంది ఉపాధ్యాయులుంటే 8 మంది విద్యార్థులే ఉన్నారు. 7వ తరగతిలో నలుగురు, 8వ తరగతిలో ఒక్కరు. 9వ తరగతిలో ముగ్గురు విద్యార్థులు ఉండగా శుక్రవారం పాఠశాలకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు.

– శంకరపట్నం

దేశవ్యాప్త కులగణన కాంగ్రెస్ విజయం

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి



ర్యాలీలో వెంకటస్వామి తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ సాధించిన విజయమని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవల్లి వెంకటస్వామి అన్నారు. రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను విద్యార్థులకు వివరించేందుకు భారత్ సంవిధాన్ బచావో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ ఇమ్రా ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందిరాచౌక్ నుంచి సీవీఆర్ఎన్ రోడ్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. కులగణన చేపట్టిన నేపథ్యంలో రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశవ్యాప్త కులగణన కోసం రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం మెడలు వంచారన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టడం చరిత్రాత్మకమన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే చేపట్టిన సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా వైట్ టీషర్ట్ మూమెంట్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు పడాల రాహుల్, నగర అధ్యక్షుడు ఉప్పరి విశాల్ పాల్గొన్నారు.